

విజన్ పక్షం

PRGI.TGBIL/26/A0206



కోల్‌కతా దుర్గా పూజలో పెను విషాదం..
తొక్కిసలాటలో 19 మంది భక్తుల మృతి

సంపుటి:-01, సంచిక:-143, మంగళవారం 20-10-2026, పేజీలు:-4, వెల: 2/-, ఎడిటర్:- ఎల్లని రాజేశ్వర్ గౌడ్ , పబ్లిషర్స్ : తెలంగాణ , ఆంధ్రప్రదేశ్

సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి



- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ
- ప్రకృతి ఆరాధనకు, మహిళల ఐక్యతకు నిదర్శనం
- సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించాలి
- ప్రతి ఇంటా సుభశాంతులు, సిరిసంపడలు వెల్లివిరియాలి



హైదరాబాద్ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా, ప్రకృతి ప్రేమకు ప్రతిరూపంగా, మహిళల ఐక్యతకు నిదర్శనంగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు ప్రకృతి ఒడిలో విరబూసే రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, భక్తిశ్రద్ధలతో గౌరమ్మను పూజిస్తూ, ఆటపాటలతో ఉత్సాహంగా జరుపుకునే ఈ పూల పండుగ తెలంగాణ ప్రజల జీవనశైలికి, సాంస్కృతిక వైభవానికి అద్దం పడుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, ప్రకృతిని ఆరాధించే సంప్రదాయానికి, మహిళల ఐక్యతకు, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, మన సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు ప్రతీక అని తెలిపారు. తరతరాలుగా మన పూర్వీకులు అందించిన ఈ అపురూపమైన సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సద్దుల బతుకమ్మ ప్రతి ఇంటా సంతోషాల పూలు పూయించాలని, ప్రతి కుటుంబంలో సిరిసంపదలు, సుఖశాంతులు వెల్లివిరియాలని, తెలంగాణ ఆడపడుచుల జీవితాల్లో ఆనందం, ఆత్మవిశ్వాసం నిండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి వైభవం దశదిశలా విరాజిల్లుతూ, మన సంప్రదాయాల పరిమళం తరతరాల పాటు విస్తరించాలని అభిలషించారు.

ఒక్క ఉద్యోగం లేదు, కోట్లాది రూపాయలు వసూలు

టోమ్‌కామ్‌పై హరీశ్ రావు ఫైర్



- జర్మనీ ఉద్యోగాల పేరిట టోమ్‌కామ్ భారీ మోసానికి పాల్పడిందన్న హరీశ్ రావు
- 70 మంది యువకుల నుంచి ఒక్కొక్కరి దగ్గర రూ.4.5 లక్షల వరకు వసూలు
- రెండేళ్లు గడిచినా ఒక్కరికీ ఉద్యోగం రాలేదని, ఇంటర్వ్యూ కూడా జరగలేదని ఆరోపణ
- బాధితులకు నష్టపరిహారం ఇచ్చి, సీఐడీ విచారణ జరపాలని బీఆర్ఎస్ డిమాండ్
- టోమ్‌కామ్ ఫీజులు, ఇచ్చిన ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని విజ్ఞప్తి

ఎన్హెచ్ఎం ఉద్యోగుల జీతాల్లో కోత ప్రభుత్వంపై కవిత ఫైర్

- జీతాలు తగ్గిస్తూ ఇచ్చిన జీవో 1195ను రద్దు చేయాలని కవిత డిమాండ్
- కొందరి ఉద్యోగులకు రూ.4,000 నుంచి రూ.5,000 వరకు జీతాలు తగ్గాయని ఆరోపణ
- సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక



నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల జీతాలను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 1195పై- మిగతా 2 లో

కోల్‌కతా తొక్కిసలాట ఘటన

- బాధితులను పరామర్శించిన అమిత్ షా.. ఏడుగురి అరెస్ట్
- కోల్‌కతా దుర్గా పూజ మండపంలో తొక్కిసలాటలో 19 మంది మృతి, 25 మందికి గాయాలు
- క్షతగాత్రులను పరామర్శించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఎం సువేందు అధికారి
- నిర్వాహకులు సహా ఏడుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో సిట్ దర్యాప్తునకు ఆదేశం



పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో దుర్గా పూజ ఉత్సవాల్లో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఉత్తర కోల్‌కతాలోని చోర్‌బగాన్ సార్వజనిన్ దుర్గా పూజ మండపం వద్ద జరిగిన తొక్కిసలాటలో 19 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 25 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేడు కోల్‌కతాలో పర్యటించి, బాధితులను పరామర్శించారు. ఈ విషాద ఘటన కారణంగా రాష్ట్రంలో తన ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాలను అమిత్ షా వాయిదా వేసుకున్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి వెంటరాగా, ఆయన నగరంలోని ఒక ప్రైవేట్ నర్సింగ్ హోంలో

ఏపీకి గోదావరి బోర్డులో ఎదురుదెబ్బ

ఆ ప్రాజెక్టుల జోలికి వెళ్లలేమన్న బోర్డు



- తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరాలను తోసిపుచ్చిన గోదావరి బోర్డు
- అనుమతులు పొందిన ప్రాజెక్టులను పునఃసమీక్షించే అధికారం లేదని స్పష్టీకరణ
- ఈ నెల 30న జరగనున్న బోర్డు సమావేశం
- నిధులు, టెలిమెట్రీ కేంద్రాల ఏర్పాటుపై అజెండాలో చర్చ

తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులపై ఆంధ్రప్రదేశ్ - మిగతా 2 లో

భారత్ మాకు ముఖ్య మిత్రదేశం


రష్యా ఆయిల్ కొనుగోళ్లపై అమెరికా కీలక వ్యాఖ్యలు



- రష్యా ఇంధన కొనుగోళ్లపై ఆంక్షల నుంచి భారత్‌కు తాత్కాలిక మినహాయింపు
- 60 రోజుల పాటు మినహాయింపు ఇస్తున్నట్టు ప్రకటించిన ట్రంప్ ప్రభుత్వం
- భారత్ ఒక్కసారిగా మారడం కష్టమని అమెరికా వ్యాఖ్య
- భవిష్యత్తులో టారిఫ్‌ల ముప్పు పూర్తిగా తొలగిపోలేదని సంకేతాలు - మిగతా 2 లో

ఫ్రాన్స్‌లో హింసాత్మక నిరసనలు

143 ఏళ్ల చారిత్రక భవనానికి నిప్పు




- ఫ్రాన్స్‌లో హింసాత్మకంగా మారిన జీవన వ్యయ నిరసనలు
- 143 ఏళ్ల నాటి లిమోజెస్ టౌన్ హాల్ భవనాన్ని దగ్ధం చేసిన ఆందోళనకారులు
- దేశవ్యాప్తంగా 1200 మంది అరెస్ట్, 150 మంది పోలీసులకు గాయాలు
- వలస విధానాలే హింసకు కారణమంటూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వ్యాఖ్య
- హింసకు తావులేదంటూ ఖండించిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్

ఫ్రాన్స్‌లో పెరుగుతున్న జీవన వ్యయానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు హింసాత్మకంగా మారి తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. ఈ ఆందోళనల్లో భాగంగా 143 ఏళ్ల నాటి చారిత్రక లిమోజెస్ టౌన్ హాల్ భవనానికి ఆందోళనకారులు నిప్పు పెట్టారు. ఈ ఘటనలో భవనం చాలా - మిగతా 2 లో

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి గవర్నర్‌ను కలిసిన జగన్

- స్థానిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార పక్షం అక్రమాలకు పాల్పడుతోందని ఫిర్యాదు
- ఎన్నికల ప్రక్రియకు కేంద్ర బలగాల పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- ఓటమి భయంతోనే చంద్రబాబు దాడులు చేయిస్తున్నారని ఆరోపణ
- ప్రజాస్వామ్య పరిరక్షణకు న్యాయపరమైన పోరాటం చేస్తామని స్పష్టీకరణ



రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను కోరారు. ఆదివారం ఆయన రాజ్‌భవన్‌లో

భారత్ ఆగ్రహం.. దిగొచ్చిన వైస్ ప్రెసిడెంట్.. తప్పు తనదేనన్న జేడీ వాన్స్!



- హెచ్-1బీ వీసాదారులపై చేసిన 'బానిసలు' వ్యాఖ్యలపై వాన్స్ వివరణ
- నా మాటలు సరికావు, ఆ తప్పు తనదేనని అంగీకరించిన వైనం
- భారత్ నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైన తర్వాత ఉపాధ్యక్షుడి స్పందన
- తన విమర్శ కంపెనీల విధానాలపైనే కానీ, ఉద్యోగులను ఉద్దేశించి కాదని స్పష్టీకరణ

హెచ్-1బీ వీసాదారులను 'ఇండెంచర్డ్ సర్వెంట్స్' (ఒప్పంద బానిసలు) అని సంబోధిస్తూ - మిగతా 2 లో

భారత్ మాకు ముఖ్య మిత్రదేశం

మొదటిపేజీ తరువాయి – భారత్ అమెరికాకు అత్యంత ముఖ్యమైన మిత్రదేశమని, ఇంధన అవసరాల కోసం రష్యాపై ఆధారపడటాన్ని ఒక్క రోజులో మార్చుకోవడం కష్టమని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో వ్యాఖ్యానించారు. రష్యా నుంచి భారీగా ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటున్న భారత్‌కు అమెరికా తాత్కాలిక ఊరట కల్పిస్తూ అమెరికా నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో రుబియో ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యాపై విధించిన ఆంక్షల చట్టం నుంచి భారత్ సహా కొన్ని దేశాలకు 60 రోజుల పాటు మినహాయింపు ఇస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం 'లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్' కింద ఈ వెయివర్‌పై సంతకం చేశారు. ఈ చట్టం ప్రకారం, రష్యా నుంచి అధిక మొత్తంలో చమురు, గ్యాస్ కొనుగోలు చేసే టాప్ 5 దేశాల (భారత్, చైనా సహా) నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే వస్తువులపై 100 శాతం వరకు టారిఫ్‌లు విధించే అధికారం ఉంది. అయితే, జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ట్రంప్ ఈ నిబంధనలను తాత్కాలికంగా నిలిపివేశారు. శనివారం వాషింగ్టన్‌లో విలేకరులతో మాట్లాడిన మార్కో రుబియో, ఈ నిర్ణయం వెనుక గల కారణాలను వివరించారు. "ఈ ఆంక్షలు కేవలం రష్యాపైనే కాదు. భారత్ వంటి ఇతర దేశాలపైనా టారిఫ్‌ల రూపంలో ప్రభావం చూపుతాయి. అందుకే అధ్యక్షుడు 60 రోజుల సమయం తీసుకుని, ప్రపంచ, అమెరికా ఆర్థిక వ్యవస్థలపై పడే ప్రభావాన్ని అధ్యయనం చేయాలని భావిస్తున్నారు" అని తెలిపారు. భారత్ ఇంధన వనరులను వైవిధ్యపరుచుకుంటున్నప్పటికీ, రష్యా నుంచి ఇంకా గణనీయమైన మొత్తంలో ఇంధనాన్ని కొనుగోలు చేస్తోందని, ఇది ఒక్కరోజులో మారే ప్రక్రియ కాదని ఆయన స్పష్టం చేశారు. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా నుంచి చౌకగా ముడి చమురు లభించడంతో భారత్ భారీగా దిగుమతులను పెంచుకుంది. ప్రస్తుతం భారత్‌కు రష్యానే అతిపెద్ద చమురు సరఫరాదారుగా ఉంది. అయితే, తమ ఇంధన భద్రత కోసం వివిధ దేశాల నుంచి మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కొనుగోళ్లు జరుపుతామని భారత్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసింది. ప్రస్తుతం ఉజ్బెకిస్థాన్, భారత్ పర్యటనలో ఉన్న రుబియో, భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో సమావేశమై, జామ్‌నగర్‌లోని రిఫైనరీని సందర్శించనున్నారు. ఈ 60 రోజుల అధ్యయనం తర్వాత అమెరికా తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఈ మినహాయింపు భారత్‌కు ఉపశమనం కలిగించినప్పటికీ, భవిష్యత్తులో టారిఫ్‌ల ముప్పు పూర్తిగా తొలగిపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఏపీకి గోదావరి బోర్డులో ఎదురుదెబ్బ

మొదటిపేజీ తరువాయి – ప్రభుత్వం వ్యక్తం చేసిన అభ్యంతరాలను గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) తోసిపుచ్చింది. ఇప్పటికే అన్ని అనుమతులు పొందిన ప్రాజెక్టుల గురించి మళ్లీ చర్చించే అధికారం తమకు లేదని బోర్డు స్పష్టం చేసింది. ఈ మేరకు ఏపీ అభ్యంతరాలను పక్కన పెడుతూ నిర్ణయం తీసుకుంది. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టీఏసీ)ల నుంచి అనుమతులు పొందిన ప్రాజెక్టులను పునఃసమీక్షించలేమని గోదావరి బోర్డు తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ వ్యక్తం చేసిన అభ్యంతరాలను బోర్డు పరిగణనలోకి తీసుకోలేదు. మరోవైపు, ఈ నెల 30వ తేదీన జరగనున్న బోర్డు సమావేశానికి సంబంధించిన అజెండాను ఉభయ రాష్ట్రాలకు పంపింది. గత 17వ సమావేశపు మినిట్స్‌ను ఆమోదించడం, బోర్డు నిర్వహణకు తెలుగు రాష్ట్రాలు నిధులు కేటాయించడం, ప్రాజెక్టుల వద్ద నీటి లభ్యతను కొలిచేందుకు టెలిమెట్రీ కేంద్రాల ఏర్పాటు వంటి కీలక అంశాలను అజెండాలో చేర్చారు. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాజెక్టుల మదింపు పురోగతిపైనా ఈ సమావేశంలో చర్చించనున్నారు. అయితే, తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన ఏపీ అభ్యంతరాలకు అజెండాలో చోటు కల్పించకపోవడం గమనార్హం.

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. గవర్నర్‌ను కలిసిన జగన్



మొదటిపేజీ తరువాయి – గవర్నర్‌తో భేటీ అయ్యారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార కూటమి అప్రజాస్వామిక పద్ధతులకు పాల్పడుతోందని, ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. సమావేశం అనంతరం జగన్ మీడియాలో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంతటి అప్రజాస్వామిక వాతావరణాన్ని తానెప్పుడూ చూడలేదని అన్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం కేంద్ర బలగాల పర్యవేక్షణలో, సీసీటీవీ కెమెరాల నిఘాలో జరిపేలా చూడాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. వైసీపీ అభ్యర్థులను నామినేషన్ కేంద్రాల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని, అదే సమయంలో టీడీపీ మద్దతుదారులను లోపలికి అనుమతించి దాడులు చేయిస్తున్నారని గవర్నర్‌కు వివరించినట్లు చెప్పారు. ఈ అరాచకాలకు పోలీసులు కూడా అధికారపక్షానికే మద్దతుగా నిలుస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని 8 ప్రాంతాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని, మరో 19 చోట్ల కేవలం 36 శాతం నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకో 8 ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను చించివేశారని తెలిపారు. పులివెందులలో 36 వార్డులకు గాను కేవలం 19 నామినేషన్లు మాత్రమే దాఖలు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ ఎంపీలు అవినాశ్ రెడ్డి, మిథున్ రెడ్డి, గురుమూర్తి పట్ల వ్యవహరించిన తీరు, అభ్యర్థులపై పోలీసుల కాల్పులు, తప్పుడు కేసులు బనాయించడం వంటి అంశాలను కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. క్రియాశీలకంగా ఉన్న వైసీపీ కార్యకర్తలను భయపెట్టేందుకు బైండోవర్ కేసుల కుట్ర జరుగుతోందని జగన్ ఆరోపించారు. "ఓటమి భయంతోనే చంద్రబాబు ఇలాంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నారు. పోటీ చేయాలనుకునేవారికి అవకాశం ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ. దీనిపై న్యాయపరమైన మార్గాలతో సహా అన్ని అవకాశాలను అన్వేషిస్తాం" అని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులు ధైర్యంగా పోరాడాలని, త్వరలోనే పరిస్థితులు మారతాయని ఆయన పిలుపునిచ్చారు.

ఈసీల నియామకంపై తప్పుచేశాం: పశ్చాత్తాపం వ్యక్తం చేసిన జగన్

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ), ఇతర కమిషనర్ల నియామకం కోసం కేంద్ర ప్రభుత్వం 2023లో తీసుకొచ్చిన చట్టానికి అప్పట్లో మద్దతివ్వడం తాము చేసిన పెద్ద తప్పిదమని, అందుకు ఇప్పుడు చింతిస్తున్నామని జగన్ విచారం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న పార్టీయే ఎన్నికల కమిషనర్లను నియమించే ప్రక్రియను నియంత్రించకూడదని, ఈ విధానంపై ఇప్పుడు పశ్చాత్తాపం చెందుతున్నామని ఆయన అన్నారు. అంతకుముందు ఎస్ఈసీ అనిల్ పునేఠాను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ జగన్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో అయినా, రాష్ట్రంలో అయినా ఎన్నికల కమిషనర్లను అధికార పార్టీ నామినేట్ చేయకూడదని జగన్ స్పష్టం చేశారు. "గతంలో కేంద్రంలో అధికార పార్టీయే ఎన్నికల కమిషనర్‌ను నామినేట్ చేసే విధానానికి వైసీపీ మద్దతు ఇచ్చింది. కానీ ఆ రోజు మేము చేసిన తప్పుకు ఇప్పుడు బాధపడుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు. "పరీక్ష రాసే విద్యార్థే తనకు ఇన్విజిలేటర్‌ను నియమించుకున్నట్లుగా ఈ విధానం ఉంది. ఎంత నిజాయతీపరుడైన అధికారి అయినా, నియామకం నిష్పక్షపాతంగా జరగనప్పుడు విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుంది" అని జగన్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుత నియామక పద్ధతిలో లోపాలున్నాయని జగన్ వివరించారు. ఈ విధానంలో ప్రధానమంత్రి, ఆయన నామినేట్ చేసిన మరో మంత్రికి రెండు ఓట్లు, ప్రతిపక్ష నేతకు ఒక ఓటు ఉంటుందని, దీంతో ప్రభుత్వానికి అనుకూలమైన వ్యక్తే కమిషనర్‌గా నియమితులవుతారని తెలిపారు. ఈ వ్యవస్థలో ఉన్న లోపాన్ని తాము తప్పు చేసిన తర్వాతే గ్రహించామని అన్నారు. ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతను కాపాడటానికి పాత పద్ధతినే పునరుద్ధరించాలని, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ), ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేతతో కూడిన కమిటీ ద్వారానే ఈసీలను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. కమిటీలో సీజేఐ ఉండటం వల్ల నియామక ప్రక్రియ నిష్పక్షపాతంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నియామకంలో కూడా ఇదే తరహా సంస్కరణలు తీసుకురావాలని జగన్ కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు లేదా టీడీపీ ప్రభుత్వం ఎస్ఈసీని నియమించకూడదని ఆయన స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అధికార టీడీపీ కూటమి అడ్డుకుంటోందని ఆరోపిస్తూ, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాను కలిసి ఫిర్యాదు చేసిన అనంతరం జగన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత ఎస్ఈసీని ముఖ్యమంత్రి చంద్రబాబే నియమించారని, ఆయన ఆదేశాల మేరకే ఎస్ఈసీ పనిచేస్తున్నారని జగన్ ఆరోపించారు.

ఒక్క ఉద్యోగం లేదు, కోట్లాది రూపాయలు వసూలు



మొదటిపేజీ తరువాయి – తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రభుత్వ ఆధ్వర్యంలోని టోమ్‌కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) నిరుద్యోగ యువతను దోచుకునే ఓ పెద్ద రాకెట్‌గా మారిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. జర్మనీలో ఉద్యోగాల పేరు చెప్పి 70 మందికి పైగా యువకుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి, వారిని నట్టేట ముంచారని సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హరీశ్ రావు ఆరోపణల ప్రకారం, సుమారు 15 జిల్లాల నుంచి 70-75 మంది నిరుద్యోగ యువకుల నుంచి టోమ్‌కామ్ ఒక్కొక్కరి దగ్గర రూ.4.10 లక్షల చొప్పున వసూలు చేసింది. పరీక్షలు, ఇన్సూరెన్స్, వీసా ఖర్చులతో కలిపి ఇది ఒక్కో అభ్యర్థికి దాదాపు రూ.4.5 లక్షలకు చేరిందని ఆయన వివరించారు. పేద రైతు కుటుంబాలకు చెందిన వారు తమ ఇంట్లోని మహిళల బంగారాన్ని తాకట్టు పెట్టి, అప్పులు చేసి ఈ డబ్బు కట్టారని, రెండేళ్లు గడిచినా ఉద్యోగాలు రాకపోవడంతో ఇంకా వడ్డీలు చెల్లిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లు దాటినా, బాధితుల్లో ఒక్కరిని కూడా ఒక్క జర్మన్ కంపెనీ కూడా ఇంటర్వ్యూ చేయలేదని హరీశ్ రావు తెలిపారు. జర్మన్ భాషలో బీ1 పరీక్ష పాసైన వారిని, ఇప్పుడు బీ2 పాస్ కావాలని చెప్పి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. వీరిలో తొమ్మిది మంది జర్మనీకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారంటూ టోమ్‌కామ్ ప్రచారం చేసుకున్నా, ఒక్కరు కూడా వెళ్లలేదని స్పష్టం చేశారు. ఈ అభ్యర్థులతో కుదుర్చుకున్న ఒప్పందంలో ఏదైనా వివాదం తలెత్తితే 1,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్నో కోర్టులో తేల్చుకోవాలని నిబంధన పెట్టడం దారుణమని అన్నారు. టోమ్‌కామ్ ద్వారా ఇప్పటివరకు ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయో చెప్పాలని ఆర్టీఐ ద్వారా అడిగినా, గడువు ముగిసినా సమాధానం ఇవ్వడం లేదని విమర్శించారు. బాధితులు రెండేళ్లుగా ఎదురుచూస్తుంటే, ఈ ఏడాది జూన్‌లో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కొత్త టోమ్‌కామ్ బ్యాచ్‌ను ప్రారంభించి ఉద్యోగ హామీలు ఇవ్వడం బాధితులను అవమానించడమేనని హరీశ్ రావు దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ఈ మోసానికి పాల్పడిన టోమ్‌కామ్, ఫెయిర్‌స్టీట్ ఇండియా సంస్థల నుంచి వసూలు చేసిన ప్రతి రూపాయిని బాధితులకు తిరిగి చెల్లించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. వారు కోల్పోయిన రెండేళ్ల కాలానికి, వడ్డీ భారం, మానసిక వేదనకు నష్టపరిహారం అందించాలన్నారు. బాధితులందరికీ ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, ఈ వ్యవహారంపై తక్షణమే సీఐడీ లేదా జ్యుడీషియల్ విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఫీజుల వసూళ్లు, కల్పించిన ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హరీశ్ రావు తన పోస్టులో స్పష్టం చేశారు.

ఎన్హెచ్ఎం ఉద్యోగుల జీతాల్లో కోత.. ప్రభుత్వంపై కవిత ఫైర్



మొదటిపేజీ తరువాయి – తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అత్యంత అన్యాయమైన చర్య అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని ఈ నిర్ణయాన్ని సమీక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఎన్హెచ్ఎం ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17,000 మంది ఎన్హెచ్ఎం ఉద్యోగులు పనిచేస్తుండగా, తాజా జీవో కారణంగా కొందరి జీతాల్లో రూ.4,000 నుంచి రూ.5,000 వరకు కోత పడిందని కవిత ఆరోపించారు. ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుతున్న ఈ క్లిష్ట సమయంలో జీతాలు తగ్గించడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కొందరికి జీతాలు పెంచి, మరికొందరికి తగ్గించడంలో వివక్ష కనిపిస్తోందని ఆమె విమర్శించారు. కేంద్రం ఎన్హెచ్ఎం జీతాల కోసం నిధులు ఇస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం వాటిని సకాలంలో విడుదల చేయడం లేదని ఆరోపించారు. ఎన్నికల ముందు ఎన్హెచ్ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు వారికి న్యాయం చేయడం లేదని కవిత విమర్శించారు. కాంగ్రెస్ పాలిత హిమాచల్ ప్రదేశ్‌తో సహా ఏడు రాష్ట్రాలు ఇప్పటికే ఎన్హెచ్ఎం సిబ్బందిని పర్మినెంట్ చేశాయని గుర్తుచేశారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా 30 శాతం జీతాలు పెంచి, వారిని క్రమబద్ధీకరించాలని అసెంబ్లీలో తీర్మానం చేసిందన్నారు. గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ, వ్యాక్సినేషన్ కార్యక్రమాల్లో ఎన్హెచ్ఎం ఉద్యోగుల పాత్ర కీలకమని కవిత నొక్కి చెప్పారు. ఉద్యోగులు నిరసన తెలిపేందుకు అనుమతి నిరాకరించడం, ఆరోగ్య మంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు పెంచడంతో పాటు, ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, ఉద్యోగులకు మద్దతుగా తమ సంస్థ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని ఆమె హెచ్చరించారు.

ఫ్రాన్స్‌లో హింసాత్మక నిరసనలు.. 143 ఏళ్ల చారిత్రక భవనానికి నిప్పు



మొదటిపేజీ తరువాయి – వరకు ధ్వంసమైంది. ఈ భవనానికి 1873లో నిర్మాణం ప్రారంభం కాగా, 1883లో అధికారికంగా ప్రారంభించడం జరిగింది. ఈ భవనం ఫ్రాన్స్‌లో చారిత్రక కట్టడంగా గుర్తింపు పొందింది. ముసుగులు ధరించిన కొందరు ఆందోళనకారులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు అధికారులు తెలిపారు. మంటల కారణంగా భవనం పైకప్పు పూర్తిగా కూలిపోయిందని, బయటి భాగంలో మూడింట రెండొంతులు నాశనమైందని వెల్లడించారు. ఇది దేశ వారసత్వ సంపదకు జరిగిన ఘోర విపత్తు అని స్థానిక ప్రిఫెక్ట్ మారిస్ బరేట్ ఆవేదన వ్యక్తం చేశారు. దుండగులు ఉద్దేశపూర్వకంగానే ఈ దాడికి పాల్పడ్డారని ఆయన పేర్కొన్నారు. దేశంలో పెరుగుతున్న జీవన వ్యయం, పాఠశాలల్లో పరిస్థితులకు వ్యతిరేకంగా లక్షలాది మంది మొదట శాంతియుతంగా ప్రదర్శనలు చేపట్టారు. అయితే, పారిస్‌తో పాటు మార్సెల్, లియోన్, లిల్లే వంటి నగరాల్లోనూ ఈ నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఆందోళనకారులు లూటీలకు, దహనకాండలకు పాల్పడ్డారు. ఈ ఘటనల్లో దేశవ్యాప్తంగా సుమారు 1200 మందిని అదుపులోకి తీసుకున్నామని, 150 మందికి పైగా పోలీసులు గాయపడ్డారని ఫ్రెంచ్ అధికారులు తెలిపారు. ఈ హింసను ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ తీవ్రంగా ఖండించారు. "మన గణతంత్రంలో హింసకు తావులేదు" అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఘటనపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫ్రాన్స్‌లో నెలకొన్న అశాంతికి వలస విధానాలే కారణమని ఆయన ఆరోపించారు. "వైవిధ్యం, కరుణ పేరుతో పాశ్చాత్య ఉదారవాదులు మూడో ప్రపంచ దేశాలను ఫ్రాన్స్ వంటి దేశాల్లోకి దిగుమతి చేసుకున్నారు. కానీ, వారిని కలుపుకుపోవడం వంటి ప్రాథమిక ప్రశ్నలను విస్మరించారు" అని వ్యాఖ్యానించారు. మరిన్ని చారిత్రక కట్టడాలు కాలిపోకముందే ఫ్రాన్స్ ఈ ఆందోళనలను ఆపాలని, అమెరికాలో కాంగ్రెస్ డెమోక్రాట్లు కోరుకుంటున్న భవిష్యత్తు ఇదేనని ఆయన హెచ్చరించారు.

భారత్ ఆగ్రహం.. దిగొచ్చిన వైస్ ప్రెసిడెంట్.. తప్పు తనదేనన్న జేడీ వాన్స్!



మొదటిపేజీ తరువాయి – తాను చేసిన వ్యాఖ్యలపై అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ వెనక్కి తగ్గారు. తన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో ఆ పదప్రయోగం సరికాదని అంగీకరించారు. తన విమర్శ ఉద్యోగులను ఉద్దేశించి కాదని, అమెరికా కంపెనీలు అనుసరిస్తున్న వీసా విధానాలను లక్ష్యంగా చేసుకుని మాత్రమే అని స్పష్టం చేశారు. భారత్ నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో ఆయన ఈ మేరకు వివరణ ఇచ్చారు. సీబీఎస్ నిర్వహించిన ఒక టౌన్‌హాల్ కార్యక్రమంలో జేడీ వాన్స్ మాట్లాడుతూ.. "నా మాటలు సరైనవి కావు, ఆ తప్పు నాదే" అని అంగీకరించారు. అమెరికన్లతో భర్తీ చేయలేని ఉద్యోగాలని చెప్పి, విదేశీ నిపుణులను నియమించుకుంటున్న కంపెనీల గురించే తాను మాట్లాడానని వివరించారు. వీసాపై ఆధారపడి పనిచేయడం వల్ల ఉద్యోగులు యాజమాన్యాల చేతిలో శక్తిహీనులుగా మారుతున్నారని, ఉద్యోగం పోతే తమ దేశానికి తిరిగి వెళ్లాల్సి వస్తుందన్న భయంతో వారు ఫిర్యాదు చేయడానికి కూడా సాహసించడం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ బలహీనతను కంపెనీలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నాయని వాన్స్ ఆరోపించారు. ఈ నెల ప్రారంభంలో వాన్స్ చేసిన వ్యాఖ్యలపై భారత విదేశాంగ శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. 'ఇండెంచర్డ్ సర్వెంట్స్' అనే పదం అత్యంత అవమానకరమని, దీని వెనుక బాధాకరమైన చారిత్రక, వలసవాద నేపథ్యం ఉందని భారత్ స్పష్టం చేసింది. భారతీయ నిపుణులు అత్యంత విద్యావంతులని, నైపుణ్యం కలవారని, వారు అమెరికా ఆర్థిక వ్యవస్థకు, ఆవిష్కరణలకు ఎనలేని సేవలందిస్తున్నారని విదేశాంగ శాఖ గుర్తుచేసింది. తరతరాలుగా వలస వచ్చిన వారి వల్లే అమెరికా చరిత్ర రూపుదిద్దుకుందన్న విషయాన్ని కూడా నొక్కి చెప్పింది. కొన్ని ఐటీ సంస్థలను గ్రీన్ కార్డ్ కార్యక్రమం నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించిన సందర్భంగా జేడీ వాన్స్ ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అమెరికన్ ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో తక్కువ జీతాలకు పనిచేసే విదేశీ నిపుణులను కంపెనీలు నియమించుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారత నిపుణుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించాయి. తాజాగా వాన్స్ వివరణతో ఈ వివాదం కొంత సద్దుమణిగినట్లు కనిపిస్తోంది.

అవసరమైతే ఆర్టీసీ భూములు అమ్మి అయినా చెల్లింపులు పూర్తి చేస్తాం



మొదటిపేజీ తరువాయి – వీలైనంత త్వరగా చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ చెల్లింపుల కోసం అవసరమైతే విలువైన ఆర్టీసీ భూములను విక్రయించేందుకైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఆర్టీసీ కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో గెలుపొందిన యునైటెడ్ ఫ్రంట్ నేతలతో పొన్నం ప్రభాకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించిన ఆయన... రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న బకాయిల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (సీసీఎస్) బకాయిలతో పాటు, ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇతర పెండింగ్ సమస్యలను కూడా పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పొన్నం ప్రభాకర్ వివరించారు. దీర్ఘకాలంగా పేరుకుపోయిన రిటైర్మెంట్ ప్రయోజనాలను చెల్లించడానికి భూముల అమ్మకం వంటి ప్రత్యామ్నాయ మార్గాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని ఆయన సూచనప్రాయంగా తెలిపారు. సుమారు 17,000 మంది రిటైర్డ్ ఉద్యోగులకు రూ.980 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు గతంలో సంఘాలు వెల్లడించిన నేపథ్యంలో మంత్రి ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది.

కోల్‌కతా తొక్కిసలాట ఘటన



మొదటిపేజీ తరువాయి – చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆర్.ఎన్. రవి, రాష్ట్ర ఆరోగ్య మంత్రి డాక్టర్ శరద్‌వత్ ముఖర్జీ కూడా గాయపడిన వారిని పరామర్శించారు. ఈ ఘటనపై కోల్‌కతా పోలీసులు వేగంగా స్పందించారు. తొలుత 14 మందిని అదుపులోకి తీసుకోగా, విచారణ అనంతరం పూజా కమిటీ నిర్వాహకులు, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది సహా ఏడుగురిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో కమిటీ కార్యదర్శి, ఉపాధ్యక్షుడు కూడా ఉన్నారు. పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి, హత్యకు సమానం కాని నరహత్య కింద అభియోగాలు నమోదు చేశారు. శనివారం సాయంత్రం ఆకస్మిక వర్షం కురవడంతో భక్తులు భయాందోళనలకు గురయ్యారు. అదే సమయంలో మండపంలో తప్పుడు ప్రకటనలు చేయడంతో గందరగోళం చెలరేగి తొక్కిసలాటకు దారితీసిందని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఇరుకైన ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, భద్రతా సిబ్బంది కొరత, గుంపును అదుపు చేయడంలో వైఫల్యం వంటివి కూడా ఈ దుర్ఘటనకు ప్రధాన కారణాలుగా గుర్తించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపేందుకు కలకత్తా హైకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 25 లక్షల నష్టపరిహారంతో పాటు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం కూడా ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు తలా రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించింది.

డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో సామాజిక విప్లవం

అడవి బిడ్డలకు, ట్రాన్స్ జెండర్లకు, దివ్యాంగులకు అక్షరాలతో ఆత్మీయ ఆలింగనం

విధ్యార్థులను విశేషంగా ఆకట్టుకున్న "సమతా ఫ్రీ షిప్"

ఉచిత ఉన్నత విద్య

ఉచిత ఉన్నత విద్యా స్కీం "సమతా ఫ్రీషిప్" లో 516 మంది ఆదివాసీ తెగల విద్యార్థులు నమోదు

నలుగురు ట్రాన్స్ జెండర్ విద్యార్థులు చేరిక

దివ్యాంగులు 146 మంది ఉన్నత విద్యకు నమోదు

అన్ని కోర్సుల్లో గత విద్యా సంవత్సరం 51,564 కాగా ఈ విద్యా సంవత్సరం 56,180 విద్యార్థుల చేరిక

అడ్మిషన్స్ లో గత విద్యా సంవత్సరంతో పోల్చితే సుమారు 10 శాతం వృద్ధి

ఇది కేవలం అడ్మిషన్ల సంఖ్య కాదు, ఆత్మగౌరవానికి ప్రతీక : వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి



హైదరాబాద్, అక్టోబర్19(విజన్ పక్షం): చీకటి అడవిలో పుట్టి, వెలుగు అక్షరాలకు దూరంగా ఉండిపోయిన అత్యంత వెనకబాటుకు గురైన ఆదివాసీ తెగలు, సమాజం చిన్నచూపు చూసిన ట్రాన్స్ జెండర్స్, దివ్యాంగులు – వీరంతా ప్రస్తుతం మిగిలిన అందరితో కలిసి ఒకే తరగతి గదిలో డిగ్రీ పుస్తకం పట్టుకోనున్నారు. ఈ మానవీయ దృశ్యానికి డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (దీ=ూూఖ) వేదిక అయింది. "విద్య ఒక్కటే విముక్తి మార్గం" అన్న డా. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాన్ని అక్షరాలా ఆచరణలో చూపిస్తోంది డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం. సమాజ చివరి అంచుల్లో నిలిచిపోయిన వర్గాలను అక్కున చేర్చుకుంటూ, ఉన్నత విద్యా రంగంలో నిశ్శబ్ద మానవతా విప్లవానికి శ్రీకారం చుట్టింది. అడవి బిడ్డలకు, ట్రాన్స్‌జెండర్లకు, దివ్యాంగులకు అక్షరాలతో ఆత్మీయ ఆలింగనం పలుకుతూ, వారికి ఆర్థిక భారం లేకుండా మానవతా హృదయంతో ఉన్నత చదువుల తలుపులు తెరిచింది ఈ యూనివర్సిటీ. సామాజిక సమానత్వం వైపు సమాజాన్ని నడిపించేలా యూనివర్సిటీ అడుగులు వేస్తోంది. యూనివర్సిటీ వీసీగా ప్రొ. ఘంటా చక్రపాణి భాధ్యతలు చేపట్టిన తర్వాత అందరికీ సమాన అవకాశాలు కల్పించాలనే ధృడ సంకల్పంతో విశ్వవిద్యాలయం ప్రవేశపెట్టిన ఉచిత ఉన్నత విద్యా పథకం "సమతా ఫ్రీషిప్" ఈ మార్పునకు చోదక శక్తిగా నిలిచింది. ఈ పథకం ద్వారా ఈ విద్యా సంవత్సరం 516 మంది ఆదివాసీ తెగల విద్యార్థులు ఉన్నత విద్యలో అడుగుపెట్టారు. సమాజంలో వివక్షను ఎదుర్కొంటున్న నలుగురు ట్రాన్స్‌జెండర్ విద్యార్థులు చేరి గౌరవప్రదమైన భవిష్యత్తుకు బాటలు వేసుకున్నారు. సంకల్పానికి వైకల్యం అడ్డు కాదని చాటుతూ 146 మంది దివ్యాంగులు ఈ విద్యా సంవత్సరం యూనివర్సిటీ లో చేరడం విశేషం. ఈ సమ్మిళిత విధానాలు విశ్వవిద్యాలయంపై విద్యార్థుల నమ్మకాన్ని మరింత పెంచాయి. అన్ని కోర్సుల్లో కలిపి మొదటి సంవత్సరం లో చేరిన వారు గత విద్యా సంవత్సరంలో 51,564 మంది విద్యార్థులు కాగా, ఈ విద్యా సంవత్సరం ఆ సంఖ్య 56,180కి చేరింది. గత ఏడాదితో పోల్చితే అడ్మిషన్లలో ఫస్ట్ ఇయర్ లో సుమారు 10 శాతం వృద్ధి నమోదు కావడం విశేషం. చదువును హక్కుగా మార్చి, ప్రతి గడపకూ చేరవేస్తున్న ఈ ప్రయాణం దేశంలోని ఇతర విద్యాసంస్థలకు ఆదర్శంగా నిలుస్తోంది. దేశంలోనే మొదటి సార్వత్రిక విశ్వవిద్యాలయంగా 1982లో ప్రారంభమైన డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నిజంగా బహుజన బడి గా మారింది. ఇక్కడ 90 శాతం మంది విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందినవారే. అందులో సగం మంది మహిళలు. అయినా, ఈ బడిలోకి కూడా అడుగు పెట్టలేని మరి కొన్ని వర్గాల వారు ఉన్నారనే విషయాన్ని గుర్తించి గత విద్యా సంవత్సరం (2025-26) నుండి "సమత ఫ్రీషిప్ ప్రత్యేక స్కీం" ను డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రవేశ పెట్టింది. ఆదివాసీ బిడ్డలకు ఉన్నత విద్య పూర్తిగా ఉచితం: తెలంగాణ అడవుల్లోని గోండు, కోయ, చెంచు, కొందరెడ్లు తదితర ఆదిమ తెగల పిల్లలకు డిగ్రీ పూర్తిగా ఉచితంగా యూనివర్సిటీ అందిస్తోంది. ఈ వర్గాల బిడ్డలకు ఏడాదికి రూ. 3,200 ఫీజు కూడా భారమే అని గ్రహించి, ట్యూషన్ ఫీజును పూర్తిగా మాఫీ చేసింది. కేవలం రూ. 500 రిజిస్ట్రేషన్ ఫీజు మాత్రమే చెల్లించి డిగ్రీ లో చేరొచ్చు. ఉచిత పాఠ్య పుస్తకాలు, ఆడియో-వీడియో పాఠాలు, వారి గూడెం దగ్గరే సమీపంలోని స్టడీ సెంటర్లో చదువుకునేలా యూనివర్సిటీ ఏర్పాట్లు చేసింది. ఈ పథకం ద్వారా గత విద్యా సంవత్సరంలో 376 మంది విద్యార్థులు పలు కోర్సుల్లో చేరగా ఈ విద్యా సంవత్సరం 516 మంది ఆదివాసీ తెగల విద్యార్థులు ఉన్నత విద్యలో అడుగుపెట్టారు. ట్రాన్స్ జెండర్లకు: తెలంగాణలో 10o2 అర్హత ఉన్న ఏ ట్రాన్స్ జెండర్ అయినా ఏ డిగ్రీ కోర్సులోనైనా చేరవచ్చు. రూ. 500 తో అడ్మిషన్ పొంది మిగిలిన ఫీజు మొత్తం మాఫీ. దేశంలోనే ఇలాంటి అవకాశం కల్పించిన మొదటి విశ్వవిద్యాలయం డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నిలిచింది. క్లాసుకు వచ్చినా, ఇంటి నుండే చదివినా ఒక్క రూపాయి అదనంగా కట్టనక్కర్లేదు. దీంతో 2025-26 విద్యా సంవత్సరంలో ముగ్గురు విద్యార్థులు పలు కోర్సుల్లో చేరగా ఈ విద్యా సంవత్సరం 2026-27 లో నలుగురు విద్యార్థులు అడ్మిషన్ పొందారు. దివ్యాంగులకు: 40 శాతం పైగా వైకల్యం ఉన్న వారికి కూడా ఇదే పథకం కింద ఉచిత విద్యను యూనివర్సిటీ అందుబాటులోకి తెచ్చారు. అందులో భాగంగా 2025-26 విద్యా సంవత్సరంలో 94 మంది దివ్యంగా విద్యార్థులు పలు కోర్సుల్లో చేరగా ఈ విద్యా సంవత్సరం 2026-27 లో 146 మంది దివ్యంగా విద్యార్థులు అడ్మిషన్ పొందడం యూనివర్సిటీ కే గర్వకారణం. రానున్న 5 ఏళ్లలో 1000 మంది ఆదివాసీ విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం: మానవతా హృదయంతో తీసుకున్న ఈ నిర్ణయం ఫలితం ఒక్క సంవత్సరంలోనే కనిపిస్తోంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రవేశాలు గణనీయంగా పెరిగాయి. అడవి బిడ్డల చదువుల తల్లిగా, అందరికీ సమాన అవకాశం ఇచ్చే సంస్థగా డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం మరోసారి నిరూపించుకుంది. రానున్న 5 సంవత్సరాల్లో కనీసం ఒక వెయ్యి మంది ఆదివాసీ, దివ్యాంగ, ట్రాన్స్ జెండర్ విద్యార్థులను ఉన్నత విద్యా వంతులుగా తీర్చి దిద్దాలనే సంకల్పంతో యూనివర్సిటీ ముందుకెళ్లుతోంది. ఇప్పటికే జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు, దేశ సరిహద్దుల్లో అనునిత్యం కాపలా కాసే సైనికులకు ఉచిత విద్యను అందిస్తూ ఇప్పటికీ పలువురి ప్రశంసలు పొందింది యూనివర్సిటీ, ఇప్పుడు సమాజానికి దూరంగా ఉన్న వారిని అక్షరాలతో అక్కున చేర్చుకుంటోంది అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ. ఇది కేవలం అడ్మిషన్ల సంఖ్య కాదు, ఆత్మగౌరవానికి ప్రతీక : వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అంటేనే సమానతకు ప్రతిరూపం. రాజ్యంగా నిర్మాత అంబేద్కర్ ఆశించిన సమతా సమాజం తరగతి గదిలోనే మొదలవ్వాలి అని మేం భావించాం. అందులో భాగంగానే "సమతా ఫ్రీ షిప్" స్కీం ప్రతిపాదనను ప్రభుత్వం ముందు ఉంచా. మా పాలకమండలి సభ్యులు మనస్ఫూర్తిగా మద్దతు పలికారు. అనేక సందర్భాల్లో పలు వేదికలపైన మా "సమతా ఫ్రీ షిప్ స్కీం" ఉచిత ఉన్నత విద్యా పథకాన్ని గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. ఏ. రేవంత్ రెడ్డి గారు ప్రస్తావించడం మేం గౌరవంగా భావిస్తున్నాం. గత విద్యా సంవత్సరం నుంచి మేము ప్రారంభించిన సమత ఫ్రీషిప్ కేవలం ఫీజు మాఫీ కాదు. అడవిలో పుట్టిన బిడ్డ, నేను ఉన్నత విద్యను చదవలేను, నాకు డిగ్రీ అందుకునే అవకాశం లేదు అనే భయాన్ని వారిలో పోగొట్టడం. సమాజం నన్ను వెలివేసింది అనుకునే ట్రాన్స్ జెండర్ బిడ్డకు – 'ఈ విశ్వవిద్యాలయం అండగా నిలిచి' ఉన్నత విద్యను అభ్యసించేలా తోడ్పాటు అందిస్తుంది అనే భరోసా ఇవ్వడం మా కర్తవ్యంగా భావించాం. ప్రవేశాలు 10 శాతం పెరగడం బాధ్యతను మరింత పెంచింది. ఒక గోండు యువకుడు తన గూడెంలో మొదటి గ్రాడ్యుయేట్ అయినప్పుడు, ఒక ట్రాన్స్ జెండర్ విద్యార్థిని తన డిగ్రీ సర్టిఫికెట్ తో ఉద్యోగం సంపాదించినప్పుడు – అదే మాకు అసలైన గుర్తింపుగా భావిస్తాం. చదువు అనేది దయ కాదు, హక్కు. ఆ హక్కును అట్టడుగు వర్గాల వారి వరకు చేర్చడమే మా లక్ష్యం. రండి, మీ కలలకు అక్షరాల రెక్కలు తొడుగుదాం. ఈ బహుజన బడి తలుపులు ఎప్పుడూ మీకోసం తెరిచే ఉంటాయి. అందరం చేయి చేయి కలిపి రాజ్యాంగ రచయిత డా. బి. ఆర్. అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని అభివృద్ధి వైపు ప్రయాణం కొనసాగిద్దాం. యూనివర్సిటీ. వివరాలకు: **http://braou.ac.in, http://braouonline.in** లేదా టోల్ ఫ్రీ: 18005990101, హెల్ప్ డెస్క్: 040-23680333 / 555


సోనీ కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సహాయం అందజేత

బడంగ్‌పేట్, అక్టోబర్19(విజన్ పక్షం): మహేశ్వరం నియోజకవర్గం, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నాదర్‌గుల్‌లో గల ఎంవీఎస్ఆర్ కళాశాలలో ఇటీవల 'దాండియా నైట్' వేడుకల సందర్భంగా జరిగిన దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థిని సోనీ కుటుంబానికి న్యాయం చేకూరుస్తూ, మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ అందెల శ్రీరాములు, బీజేపీ యువ మోర్చా నాయకులు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు చేసిన పోరాటం ఫలించింది. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు నాయకులంతా కలిసికట్టుగా సాగించిన నిరంతర పోరాట ఫలితంగా ఎట్టకేలకు కళాశాల యాజమాన్యం దిగివచ్చింది. సోనీ కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకొచ్చి రూ. 50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించింది. ఈ మేరకు సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు ఆ చెక్కును అందజేశారు. అంతేకాకుండా, ఇదే ప్రమాదంలో గాయపడిన ఇతర విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, అవసరమైన అన్ని శస్త్రచికిత్సలు తమ ద్వారానే చేయిస్తామని కళాశాల యాజమాన్యం స్పష్టమైన హామీ ఇచ్చింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఇలాంటి దురదృష్టకర సంఘటనల్లో బాధితులకు అండగా నిలవడం మనందరి బాధ్యత అని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా యాజమాన్యాలు కఠిన భద్రతా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు అలుపెరగని పోరాటం చేసిన ప్రతి ఒక్కరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు నిరంజన్ యాదవ్, బడంపేట్ డివిజన్ అధ్యక్షులు పవన్ కుమార్, కార్పొరేటర్ నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, ఇంద్రసేన, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఏనుగు రామ్ రెడ్డి తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



పండుగ వేళ సిబ్బందికి ఆప్యాయత

కానుక.. నూతన వస్త్రాల అందజేత



చేవెళ్ళ,అక్టోబర్ 19, విజన్ పక్షం దినపత్రిక: విజయదశమి దసరా పండుగను పురస్కరించుకుని చేవెళ్ల మున్సిపల్ 9వ వార్డు సిబ్బందికి దామరగిద్ద మాజీ సర్పంచ్ రెడ్డి శెట్టి మధుసూదన్ గుప్తా, మాజీ ఉపసర్పంచ్ మాల వెంకటయ్య నూతన వస్త్రాలను అందజేశారు. దసరా పండుగ సందర్భంగా సిబ్బందికి వస్త్రాలు అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు సిబ్బందితో పండుగ ఆసందాన్ని పంచుకున్నారు.

రాజకీయంగా ఎదురుకోలేక మా పై ఆరోపణలు మాజీ శాసనసభ్యులు శ్రీనివాసులు

రైల్వే కోడూర్ అక్టోబర్19(విజన్ పక్షం): రైల్వే కోడూరు సాయంత్రం కోడూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించి అధికార పక్షం ప్రతిసారీ కక్షసాధింపు ధోరణితో వ్యవహరించడం సమంజసం కాదని, రాత్రికి రాత్రే అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చట్టపరంగా ఎలాంటి చర్యలైనా ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, కానీ ఇలాంటి అన్యాయమైన పద్ధతులను ప్రజలు నిశితంగా గమనిస్తూనే ఉన్నారని హెచ్చరించారు.అధికారంలో ఉన్నామనే అహంకారంతో అధికారులను అడ్డుపెట్టుకుని ఫోన్లు చేయించి బెదిరింపులకు పాల్పడటం మానుకోవాలని, రాజకీయంగా నేరుగా ఎదుర్కొనే సత్తా లేకనే ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వైస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరై ఇప్పటికే పూర్తయిన రహదారి పనులపై లేనిపోని అపోహలు సృష్టిస్తూ, రాజకీయ దుర్బుద్ధితో అక్రమ కేసులతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఆ రోడ్డు పనులు పూర్తయి రవాణాకు పూర్తిగా సిద్ధంగా ఉన్నప్పటికీ, కొందరు కావాలనే బురదజల్లే యత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వివాదాస్పదంగా మారిన ఆ ప్రాంతంలో అసలు పూర్వకాలం నుండి ఎలాంటి ప్రభుత్వ రస్తా లేదని, ఆ విషయమై ఉన్నతాధికారులకు న్యాయస్థానానికి స్పష్టమైన ఆధారాలు సమర్పించినప్పటికీ కక్ష సాధింపు చర్యలు ఆపడం లేదని వాపోయారు. ఎంతో వెనుకబడిన, అటవీ ప్రాంత సరిహద్దుల్లో ఉన్న తమ గ్రామానికి రవాణా సౌకర్యం కల్పించాలనే సదుద్దేశంతోనే ఆ అభివృద్ధి పనులు చేపట్టామని, గుత్తేదారు బాధ్యతలను కూడా నిబంధనల ప్రకారమే నిర్వహించామని స్పష్టం చేశారు. భూమికి సంబంధించిన వివాదాలు ఉన్నతాధికారుల దృష్టిలో ఉన్నప్పటికీ, కేవలం రాజకీయ కక్షలతోనే తప్పుడు కేసులు బనాయించి మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వరుసగా ప్రజల మద్దతు పొందుతూ తాము సాధిస్తున్న విజయాలు, ప్రజాదరణను ఓర్వలేకనే ఇలాంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. గుండె ఆపరేషన్ చేయించుకున్న సీనియర్ నాయకుడి పట్ల కనీస మానవత్వం లేకుండా వ్యవహరిస్తూ, అర్ధరాత్రి వేళల్లో అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేయించడం దారుణమని, ప్రజాక్షేత్రంలోనే ఇటువంటి అప్రజాస్వామిక చర్యలకు తగిన రీతిలో బుద్ధి చెబుతామని వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధిడ కోడూరు నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు అన్నారు ఈ కార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబెర్ రామిరెడ్డి ధ్వజారెడ్డి, రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షుడు భరత్ కుమార్ రెడ్డి, ఎక్స్ జెడ్పిటిసి రత్నమ్మ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుబ్బరామరాజు, వైఎస్ఆర్సిపి నాయకులు తదితరులు భారీగా పాల్గొన్నారు.



ప్లాటినం సిటీ ఫేజ్-2 కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని



బడంగ్‌పేట్, అక్టోబర్ 19 (విజన్ పక్షం): నాదర్‌గుల్ (స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజ్ దగ్గర) వెలసిన ప్లాటినం సిటీ ఫేజ్-2 కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం కాలనీ నివాసులందరి సమక్షంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో నూతన కమిటీ సభ్యుల పేర్లను అధికారికంగా ప్రకటించారు.

నూతన కార్యవర్గ వివరాలు:

అధ్యక్షులు: ఎస్. నర్సింగరావు,ఉపాధ్యక్షులు: పీ. శివాజీ,


ప్రధాన కార్యదర్శి: ఆర్. పవన్, కోశాధికారి: పీ.వెంకట్రామయ్య, సలహాదారు: ఆర్. రోహిత్ రెడ్డి,

జాయింట్ సెక్రటరీలు: ఎస్. రామసురేష్, ఆర్. రమణ, కృష్ణ

జాయింట్ ట్రెజరర్లు: రాజు, విజయ్, గణేష్ చారి

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రతినిధులకు కాలనీవాసులు పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతాం: బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. కాలనీలో మౌలిక వసతుల కల్పన, పరిశుభ్రత, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. అందరి భాగస్వామ్యంతో ప్లాటినం సిటీ ఫేజ్-2ను ఆదర్శ (మోడల్) కాలనీగా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తామని స్పష్టం చేశారు. ఇంతకాలం కాలనీ అభివృద్ధికి విశేష సేవలందించిన పూర్వ కమిటీ సభ్యుల కృషిని ఈ సమావేశంలో ప్రత్యేకంగా కొనియాడారు. కాలనీ సర్వముఖాభివృద్ధికి నివాసులందరూ తమ వంతు సహకారాన్ని అందించాలని నూతన కార్యవర్గం విజ్ఞప్తి చేసింది.



అమెరికాలో హిస్టారికల్ వరల్డ్ ప్రీమియర్

దేశమంతా ఎదురు చూస్తున్న పాన్ ఇండియా పౌరాణిక దృశ్యకావ్యం 'రామాయణ'. నితీశ్ తివారీ రూపొందిస్తున్న ఈ రెండితెర ఇతిహాసంలో సీతారాములుగా సాయిపల్లవి, రణబీర్‌కపూర్ నటిస్తున్న విషయం తెలిసిందే. దాదాపుగా మూడువేల కోట్ల నిర్మాణ వ్యయంతో రెండు భాగాలుగా సమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ ఫ్రాంచైజీలోని తొలి భాగం దీపావళి కానుకగా సరిగ్గా అక్టోబర్ 5న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, కన్నడ, తమిళం, మలయాళ భాషల్లో విడుదల కానున్నది. ఈ నేపథ్యంలో మేకర్స్ వరల్డ్ ప్రీమియర్‌కు సిద్ధమవుతున్నారు. ఈ నెల 27న సాయంత్రం అమెరికా లాస్ ఎంజెల్స్‌లోని అకాడమీ మ్యూజియం ఆఫ్ మోషన్ పిక్చర్స్‌లో ఉన్న డేవిడ్ గెఫెన్ థియేటర్‌లో ఈ సినిమా వరల్డ్ ప్రీమియర్ జరుగనున్నది. ఆహ్వానం ఉన్నవారికి మాత్రమే ప్రవేశం కల్పించే ఈ ప్రీమియర్‌కు హాలీవుడ్ ప్రముఖుల, దర్శకులు, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు, పలువురు ప్రపంచ సినీ ప్రముఖులు హాజరుకానున్నారు. ఎన్నో అంతర్జాతీయ కార్యక్రమాలకు, ఆస్కార్ వేడుకలకు వేదికగా నిలిచిన అకాడమీ మ్యూజియంలో 'రామాయణ' ప్రీమియర్ జరుగనుండటం భారతీయ సినీచరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘట్టమని మేకర్స్ చెబుతున్నారు. 945మంది ప్రేక్షకులు కూర్చునే సామర్థ్యం ఉన్న ఈ థియేటర్‌లో 3డీ ఫార్మాట్‌లో ఈ సినిమా స్క్రీనింగ్ జరుగనున్నది. ఇక ఈ ఫ్రాంచైజీకి చెందిన రెండో భాగం వచ్చే ఏడాది దీపావళికి రానున్న విషయం తెలిసిందే.

రివార్డులతోపాటు అవార్డులూ సాధించే సినిమా



పవేక్ వీకే, అనుపమ సరయేశ్వరన్, సరయూ, అఖిల్ ఉద్దెమారి ప్రధాన పాత్రధారులుగా రూపొందిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'క్రేజీ కల్యాణం'. ఇంద్రన్ గాణాలు దర్శకుడు. బూసం జగన్‌మోహన్‌రెడ్డి నిర్మాత. ఇటీవలే విడుదలైన ఈ సినిమా థియేటర్లలో ప్రదర్శితమవుతున్నది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఈ సినిమా సక్సెస్‌మీట్‌ను నిర్వహించారు. చిత్ర కథానాయిక అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ 'ఆడియన్స్ రెస్పాన్స్ అద్భుతంగా ఉంది. గట్స్, ప్యాషన్ ఉన్న ఇలాంటి టీమ్ ఉంటేనే, ఈ తరహా విజయాలు సాధ్యమవుతాయి. నేను కమర్షియల్ సినిమాలతోపాటు కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలు కూడా చేస్తుండటం వల్ల ప్రేక్షకులకు వినోదంతో పాటు మంచి సందేశం కూడా ఇవ్వగలుతున్నా. వినోదం, సందేశం రెండూ ఉన్న సినిమా 'క్రేజీకల్యాణం' అని పేర్కొన్నారు. దసరా పండక్కి రక్తపాతాలతో కూడిన సినిమాలతోపాటు రక్తసంబంధాల కథల్ని కూడా చూస్తామని ప్రేక్షకులు రుజువు చేశారని, భావోద్వేగాలతో ప్రతి తెలుగువాడినీ కలిపే సినిమా ఇదని, రివార్డులతోపాటు ఈ సినిమా అవార్డులను కూడా సాధిస్తుందని అగ్రనటుడు సరేశ్ వీకే నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా చిత్రబృందమంతా మాట్లాడారు.

హానెస్ట్‌గా తీసిన గ్లోబల్ సినిమా 'కల్ట్'



'మొదటి అయిదు నిమిషాలకే ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లే సినిమా ఇది. ఇదో గ్లోబల్ కంటెంట్. అందుకే ఈ సినిమాను జపనీస్,స్పానిష్ భాషల్లో కూడా డబ్ చేశాం. ఇది భాషను దాటి వెళ్లే సినిమా. రెండు గంటల 20 నిమిషాల పాటు ఇంటెన్స్ డ్రామా ఉంటుంది. యాక్షన్ కంటే ఆడియన్స్ డ్రామాకు కనక్టవుతారు. నేను ఎక్స్‌పెరిమెంట్ చేసిన ప్రతిసారీ ఆడియన్స్ కనక్ట్ అయ్యారు. ఇందులో ఎలాంటి ఈక్వేషన్స్, క్యాలక్యులేషన్స్ ఉండవు. చాలా హానెస్ట్‌గా ఈసినిమా చేశాం. ఇందులో 150మంది ప్రొఫషనల్ యాక్టర్స్ ఉన్నారు. వారంతా కేవలం నా కోసం ఈ సినిమాలో భాగమయ్యారు. నటుడిగానే కాక, దర్శకునిగా కూడా నాకు సంతృప్తిని ఇచ్చిన సినిమా 'కల్ట్' అని విశ్వక్‌సేన్ అన్నారు. అయన నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కల్ట్'. సుందీప్ కాకరాల నిర్మాత. ఈ నెల 28న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో విశ్వక్‌సేన్ మాట్లాడారు. ఇంకా నిర్మాత సుందీప్ కాకరాల, యాక్టర్ ఈశ్వి, అనిరుధ్, కార్తీకేయ, హారిక పెద్దన్న కూడా మాట్లాడారు. గోవాలోని ఒక నిర్మానుష్య ఐలాండ్ ఎస్టేట్‌లో 300మందితో హైగా చిక్కుకుపోవడంతో ట్రైలర్ మొదలైంది. ఆర్యులను ఉన్నఫళంగా లేపగా ఒక్కొక్కరుగా ట్రైలర్ సాగింది. ట్రైలర్‌లో విశ్వక్ సేన్ సహా విభిన్న కోణాల్లో చూపించింది. చాలాసేపుగా జరిగిన భయానక సంఘటనల నేపథ్యంలో రూపొందిన ఈ ఇండియన్ ఎక్సైటింగ్ థ్రిల్లర్ ఇదని మేకర్స్ చెబుతున్నారు.



ఈనెల 30న జ్యోతి పూర్వాజ్ "కిల్లర్" రిలీజ్

జ్యోతి పూర్వాజ్, పూర్వాజ్ ప్రధాన పాత్రలు చేసిన సై ఫై థ్రిల్లర్ సినిమా "కిల్లర్". మనీష్ గిలాడా, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. పూర్వాజ్ , పద్మనాభ రెడ్డి.ఏ నిర్మిస్తున్నారు. పూర్వాజ్ దర్శకత్వం వహించాడు. ఈ నెల 30న థియేటర్లలో మూవీ రిలీజ్ కానుంది. ఈ నెల 21న ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఓవర్సీస్‌లోనూ "కిల్లర్" మూవీ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఓఎంజి పిక్చర్స్ ఈ సినిమాను ఓవర్సీస్ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది. ఈ సంస్థ "కిల్లర్" సినిమాను అమెరికా, యూరప్, కెనడా, అరబ్ దేశాలు, మలేషియా, న్యూజిలాండ్, రష్యా వంటి దేశాల్లో విడుదల చేయనుంది.

షూటింగ్ పూర్తి



మెగా హీరో సాయిదుర్గతేజ్ నటిస్తున్న యాక్షన్ అడ్వెంచర్ 'సంబరాల ఏటి గట్టు' రోహిత్ కేపీ దర్శకత్వంలో క్రెమ్‌పో ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం షూటింగ్ విజయవంతంగా పూర్తయింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆదివారం మేకర్స్ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన 'బిహైండ్ ది సీన్స్' వీడియోలో ఈ సినిమా కోసం వేసిన భారీ సెట్స్‌ని, కొన్ని రా యాక్షన్ సన్నివేశాలతోపాటు టీమ్ మధ్య ఉన్న ఎమోషనల్ బాండింగ్‌ని కూడా చూపించారు. సరికొత్త హైగా భారీ షెడ్యూల్స్‌లో 160 రోజులకు పైగా షూటింగ్ జరిపామని, సాయిదుర్గతేజ్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ మూవీగా 'సంబరాల ఏటిగట్టు' నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. షూటింగ్ పూర్తయిన సందర్భంగా యూనిట్ మొత్తానికీ కృతజ్ఞతలు తెలుపుతూ, టీమ్‌తో కలిసి హీరో సాయిదుర్గతేజ్ సంబరాల్లో పాల్గొన్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రంలో కన్నడ నటుడు ధనంజయ, ఐశ్వర్యరాజ్, జగపతిబాబు, నరేష్ వీకే, సాయికుమార్, శ్రీకాంత్ మేక, అనన్య నాగళ్ల ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: వెట్రి పళనిసామి, సంగీతం: టి.అజనీష్ లోక్‌నాథ్.

Flat No: G-2, Mount Nasir Apartment, 6-1-57 to 61, Saifabad, Hyderabad9441221980